# మన్య కృష్ణవేణికి శ్రద్ధాంజలి తెలిపిన గద్దె విజయ్ నేత



**విశ్వంభర, వనస్థలిపురం** :వనస్థలిపురం మార్కండేయ స్వామి దేవాలయం, వనస్థలిపురం హోస్టల్ భవన వ్యవస్థాపకులు, వనస్థలిపురం పద్మశాలి సంఘం అధ్యక్షులు మన్య సత్యనారాయణ సతీమణి మన్య కృష్ణవేణి నవంబర్ 10 వ తేదీన మరణించడం జరిగింది. విషయం తెలుసుకున్న మల్కాజిగిరి టిడిపి అడ్ హాక్ కమిటీ సభ్యులు, బి.యన్.రెడ్డి టిడిపి కాంటెస్టెడ్ కార్పొరేటర్ గద్దె విజయ్ నేత వారి నివాసానికి మన్య సత్యనారాయణ నీ పరామర్శించి కృష్ణవేణి చిత్రపటానికి నివాళి అర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా గద్దె విజయ్ నేత మాట్లాడుతూ, మన్య కృష్ణవేణి నాకు నా తల్లితో సమానం. వారి మరణం తీరని లోటు అని, వారి మరణవార్త నన్ను ఎంతగానో కలచివేసింది. వారిని కోల్పోవడం మా కుటుంబంలో ఒకరిని కోల్పోయినట్లుగా భావిస్తున్నాను. ఈ కష్ట సమయంలో మన్య సత్యనారాయణ కి, వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను. ఈ కార్యక్రమంలో గద్దె విజయ్ నేతతో పాటు టీడీపీ ఎల్.బి. నగర్ సీనియర్ నాయకులు వెంకటేశ్వరరావు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## అన్ని వృత్తులలోకెల్లా ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనది




**విశ్వంభర, చార్మినార్ :** ప్రభుత్వ అందుల పాఠశాల దారుల్ షిఫా లో ప్రభుత్వ అందుల కళాశాల మారేడుపల్లి నుండి వచ్చిన ఛాత్రోపాధ్యాయులకు 15 రోజుల శిక్షణ కార్యక్రమము ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాధవి విద్యార్థులకు కొన్ని సూచనలు ఇచ్చారు. శిక్షణ కార్యక్రమంలో విద్యార్థులను తమ యొక్క టీచింగ్ నైపుణ్యతను ప్రదర్శించి విద్యార్థులకు బ్రెయిలీ నేర్పించాలని కోరారు. అంద విద్యార్థులకు అవసరమైన బోధనోపకరణాలను ఉపయోగిస్తూ విద్యార్థులకు పాఠాలు చెప్పాలని కోరారు. ఉపాధ్యాయ వృత్తి ద్వారా విద్యార్థులకు సేవ చేస్తున్నందుకు వారిని అభినందించారు. ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మందడి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులు తమ శిక్షణ కాలంలో పాఠ్యప్రణాళికను ఉపయోగిస్తూ విద్యార్థులకు చక్కగా పాఠాలు చెప్పాలని సమయపాలన పాటించాలని ఈ సందర్భంగా సూచించారు. ఈ సమావేశంలో హై స్కూల్ ఇన్చార్జి సద్గుణ , ఉపాధ్యాయులు రవికాంత్, మలిహ పాల్గొన్నారు.

## మల్కాజిగిరి సిపి సుమతికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన రాజశేఖర్ రెడ్డి



**విశ్వంభర,మల్కాజిగిరి:** మల్కాజిగిరి నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మారెడ్డి రాజశేఖర్ రెడ్డి మల్కాజ్గిరి సిపి సుమతి రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి, శాలువా కప్పి ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా మారెడ్డి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీస్ శాఖ అందిస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ, సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తున్న పోలీస్ అధికారుల సేవలు ఎంతో విలువైనవని అన్నారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత స్థానాలను అధిరోహిస్తూ ప్రజలకు మరింత సేవలందించాలని ఆకాంక్షించారు.

## తట్టిఅన్నారంలో వ్యక్తి ఆత్మహత్య..

### - చికిత్స పొందుతూ మృతి



**విశ్వంభర , నాగోల్ :** నాగోల్ తట్టిఅన్నారం ప్రాంతంలో ఓ వ్యక్తి పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్న ఘటనలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు.పోలీసుల వివరాల ప్రకారం.. చైతన్యపురిలోని ఎంసీహెచ్ కాలనీకి చెందిన గుండగోని సైదులు (50), వృత్తిరీత్యా ఎలక్ట్రీషియన్. ఇతని తమ్ముడు గుండగోని జానకిరాములు (43), వృత్తిరీత్యా ఎలక్ట్రీషియన్, సత్యనగర్, చైతన్యపురిలో నివాసం ఉంటున్నాడు.జానకిరాములు కనిపించకుండా పోవడంతో కుటుంబ సభ్యులు చైతన్యపురి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. 11 వ తేదీన తట్టిఅన్నారం ప్రాంతంలో జానకిరాములు పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నట్లు సమాచారం. వెంటనే అతడిని 108 అంబులెన్స్ ద్వారా గాంధీ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి సోదరుడు గుండగోని సైదులు నాగోల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## రోడ్డు ప్రమాదంలో వాచ్‌మెన్ మృతి



**విశ్వంభర, నాగోల్ :** గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన వృద్ధుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.పోలీసుల వివరాల ప్రకారం.. తట్టిఅన్నారం రాఘవేంద్ర కాలనీకి చెందిన గట్టిగుండ్ల సైదులు (60) వృత్తిరీత్యా వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. నాగోల్‌లోని జివిఆర్ కాలనీలో నివాసముంటున్న సైదులు ఈ నెల 16వ తేదీ అర్ధరాత్రి సుమారు 12:45 గంటల సమయంలో తన హోండా షైన్ ఎస్పీ మోటార్ సైకిల్‌పై బండ్లగూడ బస్ డిపో రోడ్డు మీదుగా జివిఆర్ కాలనీ వైపు వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సైదులు కిందపడటంతో కుడి కంటికి తీవ్ర గాయమై, ఎడమ కాలుకు ఫ్రాక్చర్ అయింది. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్ ద్వారా అతడిని గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.ఈ ఘటనపై మృతుడి కుమారుడు గట్టిగుండ్ల లెవిన్ నాగోల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి కారణమైన గుర్తుతెలియని వాహనం ఆచూకీ కోసం పోలీసులు విచారణ చేపట్టారు.

# రైతాంగ ఐక్యతతోనే కార్పొరేట్ విధానాలను అడ్డుకోవాలి




**విశ్వంభర, నల్లగొండ:** రైతులు, వ్యవసాయ కార్మికులు, భూమిలేని పేదలు, ఆదివాసీలు ఐక్యంగా ఉద్యమించినప్పుడే కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలను తిప్పికొట్టగలమని అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ విజూ కృష్ణన్, రైతు ఉద్యమ నాయకుడు రాకేష్ టికాయత్ పిలుపునిచ్చారు. సోమవారం నల్లగొండలోని సారంపల్లి మల్లారెడ్డి నగర్‌లో వీఎస్ అచ్యుతానందన్ ప్రాంగణంలోని శంకరయ్య వేదికగా జరిగిన ఏఐకేఎస్ 36వ జాతీయ మహాసభల ప్రతినిధుల సమావేశంలో వారు ప్రసంగించారు. రైతాంగ సమస్యలపై చర్చించి, కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఐక్య ఉద్యమ కార్యాచరణ రూపొందించేందుకు మహాసభల ఆహ్వాన సంఘం ఆధ్వర్యంలో ఈ సమావేశం నిర్వహించారు. విజూ కృష్ణన్ మాట్లాడుతూ విదేశాలతో కుదుర్చుకుంటున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు, వ్యవసాయ ఉత్పత్తుల




దిగుమతులు దేశీయ రైతులకు నష్టం కలిగిస్తాయని హెచ్చరించారు. భూములు, ఖనిజ సంపదను కార్పొరేట్ సంస్థలకు అప్పగించే విధానాలను, ఆదివాసీలను అడవుల నుంచి వెళ్లగొట్టే చర్యలను తప్పుబట్టారు. తెలంగాణలో 20 లక్షలకు పైగా, ఆంధ్రప్రదేశ్‌లో 30 లక్షలకు పైగా కౌలు రైతులు ఉన్నప్పటికీ వారికి రుణాలు, సబ్సిడీలు, పంట నష్టపరిహారం అందడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఢిల్లీ రైతాంగ పోరాటంలో కేంద్రం ఇచ్చిన హామీలను అమలు చేయాలని, ఎంఎస్ స్వామినాథన్ సిఫారసుల మేరకు కనీస మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. రాకేష్ టికాయత్ మాట్లాడుతూ ఢిల్లీ సరిహద్దుల్లో 13 నెలలపాటు సాగిన రైతాంగ పోరాటం దేశవ్యాప్త ఉద్యమాలకు స్ఫూర్తిగా నిలిచిందన్నారు. సుమారు 600 రైతు సంఘాలను సంయుక్త కిసాన్ మోర్చా వేదికపైకి తీసుకురావడం కీలక పరిణామమని పేర్కొన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుల స్ఫూర్తితో ఉద్యమాలను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. నవంబర్ 26న దేశవ్యాప్తంగా నిరసనలు, 27న చక్కాజామ్ చేపట్టాలని సూచించారు. రైతు ఆత్మహత్యలతో కుటుంబాల్లో మహిళలపై బాధ్యతల భారం పెరుగుతున్నదని ఐద్వా జాతీయ ప్రధాన కార్యదర్శి శ్రీమతి టీచర్ ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయంలో మహిళల శ్రమకు గుర్తింపు కల్పించాలని కోరారు. పెట్రోల్, డీజిల్, విత్తనాలు, నిత్యావసరాల ధరల పెరుగుదల రైతులపై భారంగా మారిందని ఏఐకేకేఎంఎస్ నాయకుడు శంకర్ ఘోష్ విమర్శించారు. తెలంగాణ రైతాంగ పోరాట స్ఫూర్తితో ఐక్య ఉద్యమాలను విస్తరించాలని ఏఐకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పురుషోత్తం శర్మ పిలుపునిచ్చారు. మహాసభలో రెండు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల రద్దు, కనీస మద్దతు ధరకు చట్టబద్ధత, ఉపాధి హామీ పథకం పునరుద్ధరణ, నాలుగు కార్మిక కోడ్‌ల రద్దు తదితర డిమాండ్లతో నవంబర్ 26న దేశవ్యాప్త నిరసనలు నిర్వహించాలని తీర్మానించారు. అన్ని పంటలకు ఉత్పత్తి వ్యయం సీ2పై 50 శాతం అదనంగా కనీస మద్దతు ధర నిర్ణయించి చట్టబద్ధత కల్పించాలని మరో తీర్మానంలో కోరారు. అంతకుముందు ఏఐకేఎస్ జాతీయ అధ్యక్షుడు అశోక్ ధావలే పతాకాన్ని ఆవిష్కరించి మహాసభలను ప్రారంభించారు. సీతారాం ఏచూరి, వీఎస్ అచ్యుతానందన్, బుద్ధదేవ్ భట్టాచార్య తదితరులకు నివాళులర్పిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో జూలకంటి రంగారెడ్డి, పి. కృష్ణప్రసాద్, హన్నన్ మొల్లా, అమ్రారామ్, ఈపీ జయరంజన్, పి. షణ్ముగం, బిప్లవ్ మజుందార్, ఎం. విజయ్‌కుమార్, ఇంద్రజిత్ సింగ్, బాదల్ సరోజ్, వల్సన్ పనోలి, పబిత్రకార్, ముకుత్ సింగ్, తీగల సాగర్, అజిత్ నావలే, అవదేశ్‌కుమార్, వినోద్‌కుమార్, రఘువీర్ గుడిగాయ్, ఎలమారం కరీం, ఎం. సాయిబాబు, సింధు, బి. వెంకట్, శ్రీమతి టీచర్, సుభాష్ జెక్కర్, పోతినేని సుదర్శన్, ఎం. శోభన్, రావుల వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఫసల్‌వాదిలో ప్రపంచంలోనే అతిపెద్ద ఏకశిలా నందీశ్వరుడు!

### రూ.9 కోట్ల వ్యయంతో, 684 టన్నుల భారీ శిలతో విగ్రహ నిర్మాణం

### పనులకు శ్రీకారం చుట్టిన జగ్గారెడ్డి, నిర్మల

### మహాక్రతువులో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి: జగ్గారెడ్డి పిలుపు





**విశ్వంభర, సంగారెడ్డి :**సంగారెడ్డి జిల్లా ఫసల్‌వాదిలోని శ్రీ జ్యోతిర్వాస్తు విద్యాపీఠం మరో అపూర్వ ఆధ్యాత్మిక నిర్మాణానికి వేదికగా నిలుస్తోంది. విద్యాపీఠం ప్రాంగణంలో నిర్మితమవుతున్న అరుదైన 'శ్రీ కైలాస ప్రస్తార మహామేరు'లో భాగంగా, ప్రపంచంలోనే అతిపెద్దదిగా పేర్కొంటున్న సువర్ణ శృంగ నందీశ్వర స్వామి ఏకశిలా విగ్రహ నిర్మాణానికి సోమవారం ఘనంగా శ్రీకారం చుట్టారు. విద్యాపీఠం వ్యవస్థాపకులు మహేశ్వర శర్మ సిద్ధాంతి పర్యవేక్షణలో రూ. 9 కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ పనులను టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జగ్గారెడ్డి, టీజీఐఐసీ మాజీ చైర్‌పర్సన్ నిర్మల ప్రత్యేక పూజలు నిర్వహించి లాంఛనంగా ప్రారంభించారు.

**284 చక్రాల వాహనంపై భారీ ఏకశిల తరలింపు..**

ఈ విగ్రహ నిర్మాణం కోసం సంగారెడ్డి సమీపంలోని ఎర్రనూర్ గుట్టల నుంచి 684 టన్నుల బరువున్న భారీ ఏకశిలను సేకరించారు. 32 అడుగుల పొడవు, 19.5 అడుగుల ఎత్తు, 14 అడుగుల వెడల్పు కలిగిన ఈ అరుదైన శిలతో నందీశ్వర స్వామి విగ్రహాన్ని అత్యద్భుతంగా తీర్చిదిద్దనున్నారు. ఈ భారీ శిలను 284 చక్రాలు కలిగిన ప్రత్యేక వాహనం ద్వారా త్వరలోనే ఫసల్‌వాది విద్యాపీఠానికి తరలించనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు.

**ప్రభుత్వ నిధులతో ఆశ్రమ అభివృద్ధికి కృషి: జగ్గారెడ్డి..**

ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ.. మహేశ్వర శర్మ సిద్ధాంతి సంకల్పంతో నిర్మితమవుతున్న ఈ భారీ నందీశ్వర విగ్రహం సంగారెడ్డి ప్రాంతానికే గర్వకారణమని కొనియాడారు. ఈ మహాక్రతువు విజయవంతం కావడానికి ప్రజలు, భక్తులు, దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఆర్థికంగా తోచిన సహాయం అందించాలని పిలుపునిచ్చారు. వ్యక్తిగతంగా తాను కూడా ఈ కార్యక్రమంలో భాగస్వామినవుతానని, ఆశ్రమ అభివృద్ధికి ప్రభుత్వ పరంగా అవసరమైన నిధులు తీసుకువచ్చేందుకు పూర్తిస్థాయిలో కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ నిర్మాణం పూర్తయితే ఫసల్‌వాది దేశ వ్యాప్తంగా భక్తులను ఆకర్షించే ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతుందని ఆకాంక్షించారు.

**అరుదైన ఆధ్యాత్మిక సంకల్పం: సిద్ధాంతి..**

అంతకుముందు మహేశ్వర శర్మ సిద్ధాంతి మాట్లాడుతూ.. శ్రీ కైలాస ప్రస్తార మహామేరు ఆధ్యాత్మిక ప్రాధాన్యతను, నంది ఈశ్వర విగ్రహ విశిష్టతను వివరించారు. ఇంతటి భారీ ఏకశిలను గుర్తించి విగ్రహ రూపం ఇవ్వడం అత్యంత అరుదైన విషయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత్ కిషన్, పలువురు కాంగ్రెస్ నాయకులు, విద్యాపీఠం సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి ఎంపీ వేం నరేందర్ రెడ్డి కి వినతి



**విశ్వంభర, సరూర్ నగర్ :** రామకృష్ణాపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, పద్మశాలి సంఘం ఎల్బీనగర్ సర్కిల్ అధ్యక్షులు పున్న గణేష్ నేత ఆధ్వర్యంలో రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి ని వారి నివాసములో కలిసి గజం అంజయ్య పద్మశ్రీ అవార్డు గ్రహీత నేతృత్వంలో తెలంగాణ రాష్ట్రంలో చేనేత ఉత్పత్తులు ఎగుమతి చేయడానికి ఒక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని వినతి పత్రం ఇవ్వడం జరిగింది. వారు సానుకూలంగా స్పందించి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చేనేత , తుమ్మల నాగేశ్వరరావు దృష్టికి తీసుకువెళ్లి త్వరలో కార్పొరేషన్ ఏర్పాటు చేయుటకు కృషి చేస్తానని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ బండి మధుసూదన్ రావు,శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం చైర్మన్ తలాటి రమేష్ నేత ,జెల్ల జగన్నాథం, పగడాల ఎల్లన్న , దోర్నాల చంద్రమౌళి, పొట్ట బత్తిని నగేష్ తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛమైన మంచినీటిని సరఫరా చేయాలని ప్రజావాణిలో ఫిర్యాదు




**విశ్వంభర, సరూర్ నగర్ :** సరూర్ నగర్, డాక్టర్స్ కాలనీ డివిజన్ లలో మంచినీటి సరఫరాలో డ్రైనేజీ, కలుషితమైన నీరు వస్తుందని డివిజన్ బిజెపి సీనియర్ నాయకులు సిద్దు ముదిరాజ్ ఆధ్వర్యంలో సోమవారం ప్రజావాణి లో వాటర్ వర్క్స్ జనరల్ మేనేజర్ చంద్రు నాయక్ కి ఫిర్యాదు చేశారు. నీరు కలుషితంగా కాకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. కలుషితమైన నీటితో ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారని తెలిపారు.

## గ్యాస్ మళ్లింపు దందా గుట్టురట్టు.. ఆరుగురు అదుపులోకి

**విశ్వంభర, మెహదీపట్నం :** హైదరాబాద్ లంగర్‌హౌజ్‌లో దేశీయ ఎల్‌పీజీ గ్యాస్‌ను అక్రమంగా మళ్లించి చిన్న సిలిండర్లలో నింపి విక్రయిస్తున్న ఆరుగురిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బాపూఘాట్ సమీపంలోని ఓ స్ట్రాప్ దుకాణంపై నవంబర్ 16న గోల్కొండ జోన్ టాస్క్‌ఫోర్స్ బృందం దాడి చేసి 46 నిండిన హెచ్‌పీ సిలిండర్లు, 35 ఖాళీ చిన్న సిలిండర్లు, ఏడు రీఫిల్లింగ్ పరికరాలు, రెండు ఆటోలు, బరువు కొలిచే యంత్రాన్ని స్వాధీనం చేసుకుంది. చార్మినార్‌లోని ఎస్కే ఎంటర్‌ప్రైజెస్ గ్యాస్ ఏజెన్సీకి చెందిన ఇద్దరు డెలివరీ సిబ్బంది 14.2 కిలోల సిలిండర్ల నుంచి సుమారు రెండు కిలోల గ్యాస్‌ను తీసి మూడు కిలోల చిన్న సిలిండర్లలో నింపి అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. గ్యాస్ తగ్గిన సిలిండర్లను పూర్తిస్థాయి సిలిండర్లుగా వినియోగదారులకు సరఫరా చేస్తూ మోసానికి పాల్పడుతున్నట్లు గుర్తించారు. ఈ వ్యవహారంలో రవి, సోహైల్, పంకజ్, విక్కీ, రాము, రాజులను అదుపులోకి తీసుకున్నారు. స్వాధీనం చేసుకున్న సిలిండర్లను పౌరసరఫరాల శాఖ అధికారులు పరిశీలించగా, సంబంధిత గ్యాస్ ఏజెన్సీ, సర్దార్ బాగ్‌లోని గోదాములోనూ తనిఖీలు చేపట్టారు. సరఫరా రికార్డులు, నిల్వలు, డెలివరీ వివరాలను పరిశీలిస్తూ అక్రమాల్లో ఇతరుల ప్రమేయంపై దర్యాప్తు చేస్తున్నారు. సిలిండర్ డెలివరీ సమయంలో వినియోగదారులు బరువును తనిఖీ చేసుకోవాలని, తక్కువ గ్యాస్ ఉన్నట్లు అనుమానిస్తే అధికారులకు ఫిర్యాదు చేయాలని పౌరసరఫరాల శాఖ సూచించింది.

# ఎల్‌నినో ప్రభావంపై ప్రజలకు అవగాహన

### పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి: పాలకుర్తి శ్రీకాంత్



**విశ్వంభర, సూర్యపేట :** ఎల్‌నినో ప్రభావంతో రానున్న రోజుల్లో వాతావరణంలో తీవ్ర మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉన్నందున ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని సాంస్కృతిక సారథి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి శ్రీకాంత్, టీమ్ లీడర్ గంట భిక్షపతి సూచించారు. జిల్లా కలెక్టర్, సమాచార పౌర సంబంధాల శాఖ అధికారుల ఆదేశాల మేరకు తిరుమలగిరి మండలం చింతలకుంట తండాలో సూర్యాపేట జిల్లా సాంస్కృతిక సారథి కళాబృందం ఆధ్వర్యంలో ఎల్‌నినో ప్రభావం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎల్‌నినో ప్రభావంతో అధిక ఉష్ణోగ్రతలు, కరువు, వరదలు వంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించే అవకాశం ఉందన్నారు. రైతులు భారత వాతావరణ శాఖ విడుదల చేసే వర్షపాతం, ఉష్ణోగ్రతల సమాచారాన్ని ఎప్పటికప్పుడు గమనించాలని, వ్యవసాయ శాఖ సూచనల మేరకు పంటల సాగుపై నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా వరి, పత్తి, పప్పుధాన్యాలు, వర్షాధార పంటలు సాగుచేసే రైతులు నీటి లభ్యత, వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకోవాలన్నారు. నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పరిసరాల పరిశుభ్రత, గంజాయి, మాదకద్రవ్యాల నిర్మూలనపై కళాబృందం సభ్యులు పాటలు, కళారూపాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి డి. శ్రీలత, కళాబృందం సభ్యులు గద్దం ఉదయ్, పల్లెల రాము, పల్లెల లక్ష్మణ్, పాక ఉపేందర్, మద్దిరాల మంజుల, కుందమల్ల నాగలక్ష్మి, ములకలపల్లి మల్లమ్మ, నెమ్మాది స్రవంతి, గ్రామస్థులు పాల్గొన్నారు.

## తెలంగాణ జర్నలిస్టు ఉద్యమ చరిత్రను వక్రీకరిస్తే ఖబడ్దార్



**విశ్వంభర, ఎల్బీనగర్ :** ఎల్బీనగర్ లో తెలంగాణ జర్నలిస్టు ఉద్యమ చరిత్రను వక్రీకరించే ప్రయత్నాలు చేస్తే ఎంతమాత్రం సహించేది లేదని తెలంగాణ జర్నలిస్టు ఉద్యమకారులు (టీజేఎఫ్) తీవ్రంగా హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సాగిన ఉద్యమంలో జర్నలిస్టులు చేసిన పోరాటాలు, ఎదుర్కొన్న నిర్బంధాలు, ఒత్తిళ్లు, త్యాగాలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని స్పష్టం చేశారు. ఆనాడు ఉద్యమంలో ఎక్కడా కనిపించని వారు, ఉద్యమంతో ఏమాత్రం సంబంధం లేని వ్యక్తులు నేడు తామే అసలైన ఉద్యమకారులమని చెప్పుకోవడం హాస్యాస్పదమే కాకుండా సిగ్గుచేటని మండిపడ్డారు. ఎల్బీనగర్ ప్రాంతంలో తెలంగాణ జర్నలిస్టు ఉద్యమ చరిత్రను తమకు అనుకూలంగా మలుచుకునేందుకు కొందరు ప్రయత్నించడం దురదృష్టకరమని పేర్కొన్నారు. ఉద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొని ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్న నిజమైన ఉద్యమకారుల సేవలను విస్మరించి, సంబంధం లేని వ్యక్తులు ఉద్యమకారులుగా చలామణి కావాలని చూడటం చరిత్రను అవమానించడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమంలో ఎవరు ఎక్కడ ఉన్నారు? ఎవరు పోరాటంలో ముందుండి నడిచారు? ఎవరు ఉద్యమానికి అండగా నిలిచారు? అన్నది జర్నలిస్టు లోకానికి తెలుసని అన్నారు. చరిత్రను చెరిపేయడం ఎవరి తరమూ కాదని, వాస్తవాలను వక్రీకరించి తప్పుడు గుర్తింపు పొందాలనుకోవడం చరిత్రహీనులుగా మిగిలిపోవడమేనని ఘాటుగా విమర్శించారు. అసలైన తెలంగాణ జర్నలిస్టు ఉద్యమకారుల పోరాటాలను తక్కువ చేసి చూపించే ప్రయత్నాలను తక్షణమే మానుకోవాలని, ఉద్యమ చరిత్రను వక్రీకరించకుండా వాస్తవాలను గౌరవించాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల ఐక్యతను దెబ్బతీసేలా వ్యవహరించవద్దని టీజేఎఫ్ నాయకులు స్పష్టం చేశారు.

